నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 21 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



మందమర్రిలో పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్లు

# అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

## సర్కారుపై ఆటో డ్రైవర్ల ఫైర్

మందమర్రి/కన్నెపల్లి/బెల్లంపల్లి/తాండూర్, డిసెంబర్ 20 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆటో డ్రైవర్లను ముందస్తుగా అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తమైంది. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరంటూ వారు సర్కారుపై మండిపడ్డారు. శుక్రవారం మందమర్రి పట్టణం నుంచి హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్తున్న ఆటో డ్రైవర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కుతుందని ఆటో యూనియన్ అధ్యక్షుడు మొయ్య రాంబాబు మండిపడ్డారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఆటో డ్రైవర్లు బత్తిని రాజేశ్, బొల్లు రవి, రాజ్‌కుమార్, సారయ్య, గోవిందుల శంకర్, ఎస్కే.గౌస్, బండారి మల్లేశ్, శంకర్, కట్టప్ప ఉన్నారు. కన్నెపల్లిలో ఆటో డ్రైవర్లు పందిర్ల అంజయ్య, చెండె సత్యనారాయణ, శేఖర్‌లను అరెస్టు చేశారు. బెల్లంపల్లిలో ఆటో యూనియన్ నాయకులను వన్ టౌన్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు రూ.12 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తాండూర్ మండల ఆటో డ్రైవర్లను శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేసి మాదారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తాండూర్ మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా మాట్లాడుతూ ఆర్టీసీ ఉచిత బస్సు వల్ల ఆటో డ్రైవర్లకు ఎలాంటి నష్టం జరగడం లేదని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొనడం సరికాదన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



కన్నెపల్లిలో అరెస్టైన ఆటో డ్రైవర్లు



తాండూర్: మాదారం పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు



### అవసరమైతే మరోసారి సర్వే చేస్తాం

*సర్వే నంబర్ 43లోని భూమిపై అవసరమైతే మరోసారి సర్వే చేస్తాం. దీనిపై ఇది వరకే తమ సిబ్బందితో సర్వే చేయించాను. స్వయంగా నేనే సర్వేను పరిశీలించాను. ఈ భూమి సర్వే నంబర్ 42లో లేదు. మాపై ఎవరి ఒత్తిడిలేదు. భూమి యజమానులను పిలిపించి వారి డాక్యుమెంట్లను పరిశీలిస్తాను. ఇందులో ఏదైనా తేడా కనిపిస్తే మరోసారి సర్వే చేపిస్తాను. ప్రభుత్వ భూములను కాపాడడమే మా లక్ష్యం. కబ్జా చేస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టం.*

**- శ్రీనివాస్, నస్పూర్ తహసీల్దార్**

# సర్వే నంబర్ మార్చేసి.. స్వాహాకు యత్నం!

## నస్పూర్‌లో భూ మాయాజాలం



నస్పూర్‌లోని 6 గుంటల భూమిలో ఏర్పాటు చేసిన ప్రహరీ

- నకిలీ పత్రాలలో 6 గుంటల కబ్జాకు కుట్ర
- ప్రహరీ నిర్మాణంపై అనేక అనుమానాలు
- 'హస్తం' నేతల అండదండలు.. అధికారుల సహకారమున్నట్లు ఆరోపణలు

మంచిర్యాల ప్రతినిధి, సీసీసీ నస్పూర్, డిసెంబర్ 17 : నస్పూర్‌లోని సర్వే నంబర్ 42లోగల ప్రభుత్వ భూమి కబ్జాకు కొందరు యత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. నకిలీ పత్రాలు సృష్టించి.. సర్వే నంబర్‌ను మార్చేసి 6 గుంటలు స్వాహా చేసేందుకు కుట్ర చేస్తున్నట్లు ఆరోపణలుండగా, ఇందుకు 'హస్తం' పార్టీ నేతలు, అధికారులు సహకరిస్తున్నారనే ప్రచారమవుతున్నది.

### ప్రభుత్వ భూమి కొట్టేసే ప్రయత్నం..

నస్పూర్‌లోని సర్వే నంబర్ 42లోని భూములు వివాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. ఈ సర్వే నంబర్‌లోని భూముల చిక్కుముడులు చాలా ఏళ్లుగా విడదీయరాకుండా ఉంటున్నాయి. ఒక్కో భూమిపై నలుగురు.. అంతకంటే ఎక్కువగా మంది డాక్యుమెంట్లు సృష్టించారు. విలువైన ఇక్కడి ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో ఇప్పటికే నిర్మాణాలు జరిగిపోగా, ఉన్న భూములను కాపాడడం కష్టంగా మారుతున్నది. నస్పూర్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న బీఆర్‌ఎస్ మంచిర్యాల జిల్లా పార్టీ కార్యాలయం సమీపంలో గల సర్వే నంబర్ 42లో 6 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిపై కొందరు నకిలీ పత్రాలు సృష్టించి, ఏకంగా సర్వే నంబర్‌ను మార్చి కొట్టేయాలనే ప్రయత్నం చేస్తున్నారు. 42 సర్వే నంబర్‌ను 43 చేసి నకిలీ పత్రాలతో అధికారుల కళ్లుగప్పినట్లు ప్రచారం జరుగుతుంది. ఆ ప్రభుత్వ భూమి చుట్టూ ప్రహరీ నిర్మించారు. ప్రహరీ నిర్మాణానికి మున్సిపల్ అనుమతులు ఉన్నాయా.. ఒకవేళ లేకుంటే ఎందుకు కూల్చివేయడం లేదు.. అనుమతులు ఇచ్చి ఉంటే ప్రభుత్వ భూమిలో ఎలా ఇస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీ అండదండలతోనే ఇదంతా జరుగుతుందని ప్రచారం జరుగుతుంది.

### అసైన్డ్ భూములపై కన్ను..

నస్పూర్‌లో కలెక్టరేట్ నిర్మించడంతో అక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇదే అదునుగా భావిస్తున్న రియల్ ఎస్టేట్‌వ్యాపారులు ప్రభుత్వ అసైన్డ్ భూములపై కన్నేస్తున్నారు. ప్రైవేట్ భూమి పక్కన ప్రభుత్వ భూములుంటే నకిలీ పత్రాలు సృష్టించి వాటిని కలిపేసుకుంటున్నారు. దీనికి అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఈ ప్రాంతంలో జోరుగా సాగింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో రియల్ వ్యాపారాలకు గడ్డుకాలం వచ్చింది. దీంతో ప్రైవేట్ భూములు కాకుండా చిక్కులున్న అసైన్డ్ భూములపై కన్నేయడం, ప్రైవేట్ పట్టా భూములను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను కలుపుకుని సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### పకడ్బందీగా సర్వే చేపట్టాలి

కబ్జాకు గురవుతున్న సర్వే నంబర్ 42లోని భూమిపై పకడ్బందీగా సర్వే నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సర్వేనంబర్ 43 ప్రైవేట్ ల్యాండ్‌లో అప్పటి గ్రామ పంచాయతీ హయాంలో లేఅవుట్ వెంచర్ ఏర్పాటు చేశారు. దీని కోసం అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. ఈ లేఅవుట్‌లో గ్రామ పంచాయతీకి కొంత భూమిని కేటాయించారు. ప్రస్తుతం అందులో మున్సిపల్ నర్సరీని ఏర్పాటు చేశారు. దీన్ని ఆనుకొని సర్వేనంబర్ 42 భూమి ఉంది. అయితే నర్సరీ పక్కనున్న 42 సర్వే నంబర్‌లో ఉన్న 6 గుంటల భూమి 43 సర్వేనంబర్‌లో ఉన్నట్లు పత్రాలు సృష్టించారు. రెవెన్యూ అధికారులు సైతం సర్వే చేసి 43లోనే ఉన్నట్లు గుర్తించారు. హద్దులు సక్రమంగానే ఉన్నాయని అంటున్నారు. గతంలో సర్వేచేసిన హద్దులు.. ప్రస్తుతం చేసిన సర్వే హద్దుల్లో నిజమెంత అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమార్కులకు అధికార పార్టీ పెద్దల అండదండలు ఉండడంతోనే వీరికి మార్గం సుగమం అయిందని, వీరికి అధికారులు కూడా సహకరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దాదాపు కోటి రూపాయల విలువ చేసే ఈ భూమిని నస్పూర్‌కు చెందిన ఓ వ్యక్తి.. ఇదే ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి అమ్మినట్లు తెలుస్తున్నది. కొన్ని కారణాలతో భూమిని కొనుగోలు చేసిన సదరు వ్యక్తి మళ్లీ తాను ఈ భూమిని కొనుగోలు చేయనని, తాను ఇచ్చిన నగదును వాపస్ తీసుకున్నట్లు తెలిసింది.

# అమిత్ షాపై కన్నెర్ర

- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై పలు సంఘాల నిరసన
- కేంద్ర మంత్రి దిష్టిబొమ్మల దహనం
- రాజ్యాంగ నిర్మాత విగ్రహాలకు పాలాభిషేకాలు



బెజ్జూర్ : అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యువకులు



మందమర్రిలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జన్నారం/లక్షెట్టిపేట/మందమర్రి/మంచిర్యాల అర్బన్/కాసిపేట, డిసెంబర్ 20 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు చేయడంపై పలు సంఘాల నాయకులు కన్నెర్ర చేశారు. ఈ మేరకు శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. అమిత్‌షా దిష్టిబొమ్మలకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. జన్నారంలో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేశారు. నాయకులు మహ్మద్ రియాజొద్దీన్, సయ్యద్ ఫసిఉల్లా, షాదుపాష, ముత్యం రాజన్న, రమేశ్, ప్రవీణ్, రాజేశ్, ఇమ్రాన్, మోసిన్ పాల్గొన్నారు. లక్షెట్టిపేటలోని ఊత్కూర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు నాయకులు పాలాభిషేకం చేశారు. నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. మాల మహానాడు మండల అధ్యక్షుడు గరిసె రవీందర్ మాట్లాడుతూ అమిత్‌షా బాబా సాహెబ్ అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడారని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు పెండెం రాజన్న, బైరం లింగన్న, దొత నర్సయ్య, మేకల ప్రేంసాగర్, బైరం రవి, మినుముల శాంతికుమార్, గుత్తికొండ శ్రీధర్, ప్రేమ్‌సాగర్, నరేశ్, తొగరి రాజు, రమేశ్, విజయ్, రాజారావు, రాజశేఖర్, రాజేందర్, ప్రవీణ్ ఉన్నారు. మందమర్రిలోని సింగరేణి పాఠశాల సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దిష్టి బొమ్మను దహనం చేశారు. మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కాసిపేటలో మాల మహానాడు విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాసు సుధాకర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దళితులపై దాడులు పెరిగాయని మండిపడ్డారు. ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలో దళిత నాయకులు అమిత్ షా దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద దిష్టిబొమ్మను దహనం చేశారు. దళిత నాయకులు కొండా రాంప్రసాద్, బూస సారయ్య, దుర్గం తిరుపతి, మన్నెంపల్లి మల్లేశ్, కేశవ్, కుమ్మరి పోషన్న, దుర్గం రవి, వాసుదేవ్ పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



సమగ్ర శిక్షా ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు




ర్యాలీ తీస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

# హామీల అమలులో సర్కారు విఫలం

- సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక
- 11వ రోజు చేరిన సమ్మె
- ప్రజా సంఘాల మద్దతు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 20 : హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక అన్నారు. రెగ్యులర్ చేసి.. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో చేపట్టిన సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరుకున్నది. ఉద్యోగులు బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో చేపట్టబోయే ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మధుకర్, జిల్లా అధ్యక్షుడు శ్యాం సుందర్, టీయుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సదాశివ్, సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్, పీఆర్టీయూ ఇన్నారెడ్డి, ప్రజా సంఘాల నాయకులు దుర్గం దినకర్, కార్తీక్, తిరుపతి, రాజు, వికాస్, మహేశ్ పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేను కలిసి వినతి పత్రం అందజేశారు.

### మంచిర్యాలలో ర్యాలీ

నస్పూర్, డిసెంబర్ 20 : నిరవధిక సమ్మెలో భాగంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు శుక్రవారం మంచిర్యాలలో ర్యాలీ తీశారు. కలెక్టరేట్‌కు చేరుకొని సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సీపీఎం నాయకులు సంకె రవి, దుంపల రంజిత్, దూలం శ్రీనివాస్ మద్దతు తెలిపారు.

# అక్రమ కేసులపై ఆగ్రహం

## కేటీఆర్‌పై ఆరోపణలపై దమ్ముంటే అసెంబ్లీలో చర్చించాలని శ్రేణుల డిమాండ్

***బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెట్టడంపై శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటడమే లక్ష్యంగా ఫార్ములా ఈ కారు రేసింగ్‌ను చేపట్టగా, అవకతవకలకు పాల్పడ్డారంటూ కేసులు నమోదు చేయడంపై వారు మండిపడుతున్నారు. దమ్ముంటే ఈ అంశంపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేస్తున్నారు.***

### కేటీఆర్ అంటే కాంగ్రెస్‌కు వణుకు

*బెల్లంపల్లి, డిసెంబర్ 20 : బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకు పుడుతుందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశా రు. తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటడమే లక్ష్యంగా ఫార్ములా ఈ కారు రేసింగ్‌ను చేప ట్టగా, అవకతవకలకు పాల్పడ్డారంటూ కేసులు నమోదు చేయడంపై మండిపడ్డారు. రాజకీయ కక్ష్య సా ధింపులో భాగంగానే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, అసెంబ్లీలో చర్చకు రావాలని కేటీఆర్ పిలుపునిస్తే ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభు త్వాన్ని ప్రశ్నిస్తుండగా భయపడి కేసులతో వేధించాలని చూస్తున్నారని పేర్కొన్నారు.*



**- దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే**



### కేటీఆర్‌పై కక్ష సాధింపు తగదు

*బెల్లంపల్లి, డిసెంబర్ 20 : బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అక్రమ కేసులు పెడుతున్నారని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టాలని, కేటీఆర్ పిలుపునకు ఎందుకు స్పందించడం లేదని తెలిపారు. ఇకనైనా నీచ రాజకీయాలకు స్వస్తి పలకాలని కోరారు.*

**- బడికెల శ్రావణ్, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు**

### అక్రమ కేసులతో భయపెట్టలేరు

*చెన్నూర్ రూరల్, డిసెంబర్ 20 : ప్రజల పక్షాన ఉంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతి అన్నారు. శుక్రవారం చెన్నూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ ఈవెంట్‌లో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టడం దారుణమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం వ్యవహరిస్తున్న తీరును తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అక్రమ కేసులతో బీఆర్‌ఎస్‌ను భయపెట్టలేరన్నారు.* **- మోతె తిరుపతి, మాజీ జడ్పీటీసీ**



# అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, డిసెంబర్ 20 : జిల్లాలో చేపట్టే అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ముఖ్య ప్రణాళిక అధికారి సత్యంతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మురుగు కాలువలు, అంతర్గత రహదారులు, కల్వర్టులు, ప్రహరీ, గ్రేవల్ రోడ్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా గుత్తేదారులతో సమీక్షించాలన్నారు. ఈ నెల 31లోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఈఈ స్వామిరెడ్డి పాల్గొన్నారు.